AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
25-4-2026 (Saturday) MAIN EDITION

## కవిత పార్టీపై బీఆర్ఎస్ సెటైర్లు




**అక్షరటుడే, హైదరాబాద్:** కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేనగా తన పార్టీ పేరు పెట్టారు. గతంలో టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కవిత తన పార్టీ పేరు టీఆర్ఎస్ వచ్చేలా పెట్టారు. కవిత పార్టీపై బీఆర్ఎస్ సెటైర్లు వేసింది. ఒరిజినల్ ఒరిజినలే అని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. కోల్గేట్, బిస్లేరి ఒరిజినల్, నకిలీ ఫొటోలను షేర్ చేస్తూ కవిత పార్టీ నకిలీదని అర్థం వచ్చేలా పోస్ట్ చేసింది.

## ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్‌లో ఉద్యోగావకాశాలు




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఫైనాన్స్ రంగంలో స్థిరమైన ఉద్యోగం కోరుకుంటున్నవారికి ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్) శుభవార్త తెలిపింది. దేశవ్యాప్తంగా 180 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 21 నుంచి 30 ఏళ్ల మధ్య వయసువారు అర్హులు. ఏప్రిల్ 30 దరఖాస్తుకు గడువు ఉంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.lichousing.com ను విజిట్ చేయండి.

### ఇంధన కొరతపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అక్షరటుడే, అమరావతి:** ఇంధన కొరతతో ఏపీలో పలు చోట్ల పెట్రోల్ బంకుల మూసివేతపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. పలు జిల్లాల్లో పరిస్థితులు, ఇబ్బందులపై అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### కవితది పిట్టల దొరసాని క్యారెక్టర్



**అక్షరటుడే, హైదరాబాద్:** పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది.. అని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టి వాళ్లను ఓడించి.. బీజేపీని ప్రజలు గెలిపించారన్నారు.

### తెలంగాణకు మే 9న మోదీ..



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పూర్తయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జాతికి అంకితం చేయడంతో పాటు, మరికొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.

## చర్చల వేళ చిచ్చు.. అమెరికా కఠిన వైఖరితో ఇరాన్ వెనక్కి!



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా తన పట్టును మరింత బిగించింది. ఇరాన్ నౌకల రాకపోకలపై విధిస్తున్న ఆంక్షలను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సమర్థిస్తూ, దీనిని కేవలం ప్రాంతీయ దిగ్బంధనంగా కాకుండా 'గ్లోబల్ మిషన్'గా అభివర్ణించారు. పెంటగాన్ వేదికగా జరిగిన మీడియా సమావేశంలో హెగ్సెత్ మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా నేవీకి పూర్తి నియంత్రణ ఉందని స్పష్టం చేశారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికాఇరాన్ మధ్య పరోక్ష చర్చలు జరగాలని భావిస్తున్న తరుణంలో అమెరికా కఠిన వైఖరిని ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. అయితే, అమెరికా చర్యలపై ఇరాన్ స్పందిస్తూ.. "ఈసారి వాషింగ్టన్‌తో నేరుగా మాట్లాడే ప్రసక్తే లేదని" తెగేసి చెప్పింది.

## మంత్రి వివేక్ నర్సాపూర్ పర్యటన రసాభాస

**అక్షరటుడే, మెదక్:** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మంత్రి వివేక్ పర్యటన రసాభాసగా మారింది. మహిళలకు నెలకు రూ.2,500 ఎప్పుడు పంపిణీ చేస్తారని మంత్రిని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. దీంతో కేసీఆర్ వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని మంత్రి బదులిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు కూడా గత ప్రభుత్వ నిర్వాకమే కారణమని మంత్రి చెప్పారు. దీంతో నేతలిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

# కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్




■ తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటన ■ కేసీఆర్ మర మనిషి ■ బీఆర్ఎస్ పాలనపై కవిత విమర్శలు
■ అధికారంలోకి వస్తామని ధీమా ■ ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీ

రాష్ట్రంలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేశారు. తన పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అని ప్రకటించారు. పార్టీని జెండాను సైతం ఆవిష్కరించారు. సామాజిక తెలంగాణ ధ్యేయంగా పోరాడతానని ప్రకటించారు. కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన మర మనిషిగా మారిపోయారని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.

–అక్షరటుడే, హైదరాబాద్‌ప్రతినిధి

మేడ్చల్ సమీపంలోని మునీరాబాద్ అద్వయ ఫంక్షన్ హాల్‌లో కవిత పార్టీ పేరును ప్రకటించారు. శనివారం ఉదయం కవిత తన ఇంట్లో సర్వ మత ప్రార్థనలు చేసిన అనంతరం గన్‌పార్క్‌కు చేరుకొని అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో సభ వేదికకు చేరుకున్నారు. వేలాది అభిమానుల మధ్య కవిత తన పార్టీ పేరును ప్రకటించారు. పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల జెండాను ఆవిష్కరించారు.

**మన మనిషి కాదు..**

రాష్ట్రాన్ని నాడు పరిపాలించిన కుటుంబంతో తాను కూడా ఓ భాగం అని కవిత అన్నారు. ఆ కుటుంబంలో భాగం అయినందు కు కొన్ని విషయాల్లో సిగ్గు పడుతున్నానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను క్షమించాలని తెలంగాణ ప్రజలను కోరారు. కానీ తెలంగాణ సాధించినందుకు గర్వ పడుతున్నానని చెప్పారు. కేసీఆర్ మారిన మనిషి అని కవిత అన్నారు. మన మనిషి కాదన్నారు. మర మనిషని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏ కష్టమొచ్చినా ఆ సారు రారని విమర్శించారు. సామాజిక తెలంగాణ కోసం తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ప్రజల ముందుకు వచ్చిందన్నారు.

**20 ఏళ్లుగా పోరాటం**

గత 20 ఏళ్లుగా తెలంగాణ ఉద్యమంలో తాను పోషించి న పాత్ర ప్రజలకు తెలుసన్నారు. ఉద్యమంలో మహిళల ను భాగస్వామ్యం చేయడానికి జాగృతి ఆధ్వర్యంలో పోరాటాలు చేశామన్నారు. జాగృతి వెలిగించిన దీపం ఉద్యమ సమయంలో కాంతిరేఖ అయిందన్నారు.

**కలల తెలంగాణ రాలేదు**

తెలంగాణ వచ్చి 12 ఏళ్లు అయిన మన కలలు సాధ్యం కాలేదని కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పిందని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అనేక పనులు జరగలేదన్నారు. బానిస సంకెళ్లు పోతాయని తెలంగాణ సాధించుకుంటే.. బీఆర్ఎస్ పాలనలో రైతులకు బేడీలు పడ్డాయన్నారు.

**అమ్మగా మారాలనుకుంటున్నా..**

బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్నారు. దీంతోనే నేడు టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ బిడ్డలకు తాను ఒక అమ్మగా మారాలని అనుకుంటున్నట్లు చెప్పారు.

**పందికొక్కుల్ని పక్కన పెట్టుకున్నారు**

"నా బిడ్డ, కొడుకు తప్పు చేస్తే పార్టీ నుంచి తీసేస్తానని గతంలో కేసీఆర్ చెప్పారు"ని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు అవినీతి జరిగిందన్న తనను బయటకు పంపి, అవినీతి పందికొక్కుల్ని పక్కనపెట్టుకున్నారని ఆరోపించారు. ఆయన మన కేసీఆర్ కాదని, ఆత్మలేని మరబొమ్మ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మన కేసీఆర్ అయ్యుంటే పాలమూరు ప్రాజెక్టును కట్టించేవారని కవిత అన్నారు. హైడ్రా ఇళ్లను కూలుస్తున్న కేసీఆర్ బయటకు రాలేదన్నారు.

**రేవంత్‌రెడ్డి కర్కోటకుడు**

రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తోందని కవిత విమర్శించారు. అన్ని అనుమతులు ఉన్నా పేదల ఇళ్లు కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు.

**పాంచజన్యం పేరిట హామీలు**


బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌పై పాంచజన్యం పూరిస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే ఐదు హామీలు నెరవేరుస్తామని ప్రకటించారు. ప్రైవేట్ బడులు, విద్యా సంస్థల్లో సైతం ఉచిత విద్య అందిస్తామన్నారు. ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. తొలిఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యమకారులకు లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలిస్తామన్నారు. సామాజిక న్యాయం సాధిస్తామని చెప్పారు.

## రానున్న మూడు రోజులు మండనున్న ఎండలు




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడింది. ఆకాశం మేఘావృతం అయి ఉంటుంది. అయితే వేడి మాత్రం అధికంగా ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో రేపటి నుంచి మూడు రోజుల పాటు ఎండలు మండుతాయని అధికారులు తెలిపారు. ఉత్తర తెలంగాణలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో 43 డిగ్రీలకు చేరుకునే ఛాన్స్ ఉంది.

## స్నాప్‌చాట్‌కు పోటీగా ఇన్‌స్టా కొత్త యాప్!



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** సోషల్ మీడియా దిగ్గజం మెటా, తన 'ఇన్‌స్టాగ్రామ్' వినియోగదారుల కోసం సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేసింది. యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్న స్నాప్‌చాట్, బీరియల్ వంటి యాప్‌లకు పోటీగా 'ఇన్‌స్టాంట్స్' పేరుతో యాప్‌ను లాంచ్ చేసింది. ఇది కేవలం ఫొటోలను తక్షణమే షేర్ చేయడానికి రూపొందించిన యాప్. ఇందులో ఆర్టిఫిషియల్ ఎడిటింగ్ లేదా ఫిల్టర్ల హంగామా ఉండదు. యాప్‌ను ఓపెన్ చేసి కెమెరాపై ఒక్కసారి క్లిక్ చేస్తే చాలు.. ఫొటో దిగిపోతుంది. దానిని వెంటనే మీ స్నేహితులకు పంపవచ్చు. ప్రస్తుతానికి ఇది ప్రయోగాత్మకంగా వివిధ దేశాలు అందుబాటులోకి తెచ్చారు.

## పర్ఫెక్ట్ ఫోజులతో ఆకట్టుకుంటున్న మాళవిక!



సోషల్ మీడియా వాడకం పెరిగిన తర్వాత భాషతో సంబంధం లేకుండా హీరోయిన్స్ అందరూ అందాలను ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. అలాంటి వారిలో మాళవిక మోహనన్ ఒకరు.. అటు నటనలో గ్లామర్ ఒలకబోయడమే కాదు యాక్షన్ పర్ఫామెన్స్ ఇవ్వడానికి కూడా తాను వెనుకాడను అని నిరూపిస్తోంది ఈ ముద్దుగుమ్మ.. ఒకవైపు సినిమాలలో బిజీగా ఉంటూనే మరొకవైపు ఇంస్టాగ్రామ్ వేదికగా అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఫొటోలు.. ఇచ్చిన పర్ఫెక్ట్ ఫోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మాళవిక తాజాగా బ్రౌన్ కలర్ డ్రెస్ ధరించి అందాలతో ఆకట్టుకుంది. ముఖ్యంగా బాడీ పర్ఫెక్ట్ లుక్ తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది.

–అక్షరటుడే, సినిమా డెస్క్

## ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్..



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్ అయింది. అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా గతంలో కోదండరాం, అజారుద్దీన్‌ను నియమించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఫైల్ చాలా రోజులుగా గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండిపోయింది. అనంతరం అజారుద్దీన్ మంత్రి అయ్యారు. ఈ నెల 30 నాటికి మంత్రిగా అజారుద్దీన్ 6 నెలలు పూర్తి కానుంది. ఆలోపు గవర్నర్ ఎమ్మెల్సీల నియమాకానికి ఆమోదం తెలుపకపోతే ఆయన మంత్రి పదవి కోల్పేయేవారు. ఎమ్మెల్సీల నియామకానికి ఆమోదం తెలుపకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి పోతుందని.. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాతో ఇటీవల భేటీ అయ్యారు. ఎమ్మెల్సీల నియామకానికి ఆమోదం తెలుపాలని కోరారు. ఈ క్రమంలో తాజాగా గవర్నర్ ఆ ఫైల్‌పై సంతకం చేశారు. దీంతో అజారుద్దీన్ మంత్రిగా కొనసాగనున్నారు.

## హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు కోసం జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ప్రతి శనివారం ఆక్రమణలను తొలగించారు. నగరంలో చాలా ప్రాంతాల్లో ఫుట్ పాత్‌లు ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే. వాటిపై పలువురు వ్యాపారాలు చేసుకుంటున్నారు. దుకాణదారులు, షాపింగ్ మళ్ల నిర్వాహకులు సైతం ఫుట్ పాత్‌లను ఆక్రమించారు. దీంతో ప్రజలు రోడ్లపై నడుస్తున్నారు. ఇప్పటికే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు.. రోడ్లపై పాదచారులు నడవడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసిన షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగించారు.